




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 270 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ గురువారం 4 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :270 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA THU 4 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం..

### హాజరైన రాహుల్, ఖర్గే

- ప్రమాణం చేయించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్
- కేబినెట్లో సిద్ధరామయ్య తనయుడికి చోటు
- ప్రమాణానికి ముందు డీకేకు ఫోన్ చేసిన సోనియా గాంధీ
- అందరినీ కలుపుకుని పనిచేస్తానని సోనియాకు హామీ ఇచ్చిన డీకే

- మిగతా 2లో

# అమరావతి స్మార్ట్ సిటీకి భాగస్వామ్యం..

## రష్యా 'ఎలిమెంట్ గ్రూప్'కు నారా లోకేష్ ఆఫర్

- రష్యా సెమీకండక్టర్ దిగ్గజం ఎలిమెంట్ గ్రూప్‌తో మంత్రి లోకేష్ భేటీ
- విశాఖ, నెల్లూరు, శ్రీసిటీలలో తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- సెమీకండక్టర్, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం
- ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన ఎలిమెంట్ గ్రూప్
- అంతర్గత చర్చల అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటన



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను హై-టెక్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటి స్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా, మాస్కోలో రష్యాకు చెందిన ప్రముఖ సెమీకండక్టర్ల తయారీ సంస్థ 'ఎలిమెంట్ గ్రూప్' ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో ఆయన సమావేశమ య్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు.
ఈ సమావేశంలో ఎలిమెంట్ గ్రూప్ ప్రెసిడెంట్ ఖజోవ్ ఒలెగ్, ఇతర డైరెక్టర్లతో భేటీ అయిన మంత్రి లోకేష్, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తయారీ, డిజైన్ యూనిట్లను స్థాపించాలని ఆహ్వానించారు. భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న డిజిటల్

- మిగతా 2లో



## కోటి మందితో యోగాంధ్ర-2026: సీఎం చంద్రబాబు ప్రకటన

- జూన్ 21న కోటి మందితో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం
- 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' థీమ్‌తో యోగాంధ్ర-2026 కార్యక్రమం
- పర్యాటక కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక యోగా ప్రదర్శనలు
- యోగాంధ్ర కోసం రూ.10 కోట్ల బడ్జెట్, ప్రత్యేక పోర్టల్ ప్రారంభం
- జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది భాగస్వామ్యంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్స వాన్ని 'యోగాంధ్ర-2026' పేరుతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జూన్ 21న జరిగే ఈ కార్యక్రమ నిర్వహణ, లక్ష్యాలపై ఆయన అమరావతిలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానం యోగా అని, దానిని ప్రజా ఉద్యమంగా మార్చి ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ఏడాది 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' (వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించడం) థీమ్‌తో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. "యోగా కేవలం ఒక్కరోజు కార్యక్రమం

- మిగతా 2లో



## పవన్‌పై వ్యాఖ్యలు కరెక్ట్ కాదు..

### తెలంగాణ నేతలకు చంద్రబాబు హితవు

- తెలంగాణలో పవన్ పై వ్యాఖ్యలను ఖండించిన సీఎం చంద్రబాబు
- విద్వేషాలు రెచ్చగొట్టే మాటలు మాట్లాడటం సరైన పద్ధతి కాదు
- రాష్ట్రం విడిపోయి 12 ఏళ్లయ్యాక అనవసర వివాదాలు తగదు
- అభివృద్ధి, ప్రజాసేవలో పోటీ పడాలని రాజకీయ నాయకులకు పిలుపు

- మిగతా 2లో

## ఏపీకి ఐదు రోజుల పాటు వర్ష సూచన

- 24 గంటల్లో కేరళలోకి ప్రవేశించనున్న నైరుతి రుతుపవనాలు
- మధ్యప్రదేశ్ నుంచి రాయలసీమ వరకు కొనసాగుతున్న ద్రోణి
- వీటి ప్రభావంతో ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాల రాకపై వాతావరణ శాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. రాబోయే 24 గంటల్లో ఈ రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించనున్నట్లు అధికారులు వెల్లడించారు. తద్వారా ఇవి క్రమంగా దేశంలోని మిగతా ప్రాంతాలకు విస్తరించనున్నాయి. గురువారం నాటికి నైరుతి రుతుపవనాలు.. నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్ర ప్రాంతాలు, లక్షద్వీప్ దీవులు, కేరళతో పాటు తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు అనుకూల వాతావరణం ఉందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. మరోవైపు, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో.. మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ,

- మిగతా 2లో



## ఉచిత న్యాయ సహాయం, కోర్టు ఖర్చుల బాధ్యత వైసీపీదే..

### డీఎస్సీ అభ్యర్థులకు వైఎస్ జగన్ భరోసా

- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్ చేశామన్న జగన్
- వైసీపీ అధికారంలోకి రాగానే అక్రమాలపై రీ-ఎంక్వైరీ చేయిస్తామని వెల్లడి
- క్రీడా కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని విమర్శ

2లో





### ప్రాంతీయవాదం ఉగ్రవాదం అయితే...

## మీరే ఉగ్రవాదులు

### పవన్ కళ్యాణ్ పై నిరంజన్ రెడ్డి ఫైర్

- ఆంధ్రరాష్ట్ర పునాదులపై ఏర్పడిందే అసలైన ప్రాంతీయవాదం అన్న నిరంజన్ రెడ్డి
- తెలంగాణ ప్రజలు జాతీయవాదులు అని వ్యాఖ్య
- పక్కరాష్ట్ర నేతలు తెలంగాణను వెక్కిరిస్తుంటే రేవంత్ ఎందుకు మనంగా ఉన్నారని ప్రశ్న

- మిగతా 2లో



## ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం.. 21 మంది సజీవ దహనం

- లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఘటన
- పలువురికి తీవ్ర గాయాలు
- 37 మందిని కాపాడిన పోలీసులు
- మంటల్ని అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది
- చినపోయిన వారికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని

పెన్ పవర్ డెస్క్:ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 21 మంది సజీవ దహనమయ్యారు. అనేక మందికి తీవ్ర గాయాలయ్యాయి. 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి

- మిగతా 2లో

### తెలంగాణ ప్రజల్లో 'తెలంగాణ' అనే భావన ఉంటుంది...

## కానీ ఆంధ్రా ప్రజల్లో 'ఆంధ్రా' అనే భావన లోపించింది

- తెలంగాణ ప్రజలను చూస్తే ముచ్చటగా ఉంటుందన్న పవన్ కళ్యాణ్
- తెలంగాణ అనే బలమైన భావన వారిలో ఉందని ప్రశంస
- ఆంధ్రాలో మాత్రం ఐక్యత లేదని, ఉప ప్రాంతీయతలే ఉన్నాయని ఆవేదన
- ఆంధ్రా ప్రజల్లో కనీసం 'ఆంధ్ర' అనే ఉమ్మడి గుర్తింపు ఉండాలన్న పవన్

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ ప్రజల్లో 'తెలంగాణ' అనే బలమైన ఐక్యతా భావన ఉందని, దాన్ని చూస్తే తనకు ముచ్చట వేస్తుందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో అలాంటి ఉమ్మడి భావన కొరవడిందని, ఇక్కడ ఐక్యతకు బదులుగా

- మిగతా 2లో




## భారత్‌పై అమెరికా మళ్లీ టారిఫ్స్..

### కేంద్రం స్పందన ఇదే..!

- వెట్టిచాకిరి చేయించి ఉత్పత్తులు తయారుచేయించారని అమెరికా ఆరోపణ
- అందుకుగానూ 12.5 శాతం పన్ను విధించాలని ప్రతిపాదన
- ఇది ఇంకా ఖరారు కాలేదని కేంద్రం ప్రభుత్వం వివరణ
- వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు సాగుతున్నట్లు వెల్లడి

పెన్ పవర్ డెస్క్:భారత వస్తువులపై అమెరికా మరోసారి అదనపు సుంకాలు విధించ నుందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ విషయంపై అగ్రరాజ్యంతో నిరంతరం చర్చిస్తున్నామని, ఈ పన్నుల ప్రతిపాదన ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేసింది. కార్మికులతో వెట్టిచాకిరి చేయించి ఉత్పత్తులు తయారు చేయించారంటూ భారత్‌తో సహా 60 దేశాలపై

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# జగన్ కు బీఆర్ఎస్ పోయి.. కవిత వచ్చే...!

వైసీపీ అధినేత జగన్‌కు ఇరుగు పొరుగు రాష్ట్రాల మద్దతు ఉన్న విషయం తెలిసిందే. సమయం చూసుకు ని స్పందించే నాయకులు ఉన్నారు. అయితే.. ఒక్కొక్కసారి ఆయనను విమర్శించిన పొరుగు రాష్ట్ర నేతలు కూడా కనిపిస్తారు. హరీష్‌రావు, కేటీఆర్‌వంటి తెలంగాణ నాయకులు జగన్‌కు మిత్రులే అయినా.. సమయం సందర్భం చూసుకుని ఆయనను సమర్థించారు. ఒక్కొక్కసారి తీవ్రంగా విమర్శించారు. 4 వేల కోట్ల కోసం.. జగన్.. రైతులను ఫణంగా పెట్టారంటూ.. గతంలో హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అప్పట్లో రైతులు వాడే విద్యుత్‌కు స్మార్ట్ మీటర్లు పెట్టే నిర్ణయం తీసుకున్నారు జగన్. ఇది కేంద్ర ప్రభు త్వం చెప్పడంతోనే .. చేశారని హరీష్‌రావు చెప్పారు. అంతేకాదు.. ఇలా చేస్తే.. కేంద్రం నుంచి 4 వేల కోట్ల రూపాయల మేరకు జగన్ ప్రభుత్వానికి అప్పుగా వస్తోందన్నారు. ఇది రాజకీయంగా జగన్‌కు ఇబ్బంది సృష్టించింది. ఇక, కేటీఆర్ కూడా.. ఏపీలో వైసీపీ పాలనా సమయంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావించి ..ఇరుకున పడేశారు. ఏపీలో ఎక్కడ చూసినాగుంతల రోడ్లే ఉన్నాయని.. తన స్నేహితులు చెప్పారంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ.. జగన్ బీఆర్ఎస్ నాయకుల తో కలివిడిగానే ఉంటున్నారన్న చర్చ ఉంది. కట్ చేస్తే.. ఇప్పుడు బీఆర్ఎస్ స్థానంలో కవిత తెరమీదికి వచ్చారు. నేరుగా జగన్‌ను ఆమె సమర్థించకపోయినా.. అసందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు.. వైసీపీలో చర్చకు దారితీశాయి. జగన్ రాజధాని విషయంలో చేసిన -మావిగన్- ప్రకటనను కవిత స్వాగతిస్తున్నట్టుగా మాట్లాడారు. దీనిని అడ్డు పెట్టుకుని కూటమి ప్రభుత్వంపైనా ముఖ్యంగా సీఎం చంద్రబాబుపైన, రాజధాని అమరావతిపైనా విమర్శలు గుప్పించారు. దీంతో వైసీపీ నాయకులు తమ కు బూస్ట్ వచ్చిందని అనుకుంటున్నారు. కానీ, ఇది వాపే తప్ప బలుపు కాదని.. తెలంగాణ నాయకులను విశ్వసించడం సరికాదని చెబుతున్న వారు కూడా ఉన్నారు. ఎప్పుడు ఎలాంటి టర్న్ తీసుకుంటారో తెలియని.. కవిత గారి లాంటి నాయకులను నమ్మితే.. నిండా మునగడం కాయమ ని అంటున్నారు. కాబట్టి.. కవిత ఏదో చెప్పారని.. చంద్రబాబుపై విమర్శలు గుప్పించారని.. పొంగిపోతే.. అది మొత్తానికే ఇబ్బంది అవుతుందని చెబుతున్న నాయకులు కూడా ఉన్నారు.

## ఉచిత న్యాయ సహాయం, కోర్టు ఖర్చుల బాధ్యత వైసీపీదే..

డీఎస్సీ పరీక్షల్లో తీవ్ర అన్యాయం జరిగిందంటూ ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు తమ మద్దతు ఉంటుందని వైసీపీ అధినేత జగన్ ప్రకటించారు. బాధితుల పక్షాన నిలిచి వారికి అవసరమైన ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని, కోర్టు ఖర్చులన్నింటినీ తమ పార్టీయే భరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. డీఎస్సీ అక్రమాలపై ఇప్పటికే సీబీఐ విచారణకు డిమాండ్ చేశామని గుర్తుచేసిన ఆయన.. భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ అక్రమాలపై రీ-ఎంక్వైరీ చేయించడంతో పాటు, కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక కమిషన్ కూడా వేయిస్తామని స్పష్టం చేశారు.

క్రీడా కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించిందని జగన్ తీవ్రంగా విమర్శించారు. ఎలాంటి పరీక్షలు లేకుండా కేవలం సర్టిఫికెట్ల ఆధారంగానే ఉద్యోగాలు ఇస్తామంటూ ప్రభుత్వం జీవో ఇచ్చిందని, చంద్రబాబు తనకు కావలసిన వారికి లబ్ధి చేకూర్చడానికే ఈ గేట్లు తెరిచారని ఆరోపించారు. అనుకున్న వారికి ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి కాగానే, మళ్లీ పాత జీవోను మార్చేసి కొత్త జీవోను తీసుకురావడంలో ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో పాలకుల స్వార్థం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు. ప్రస్తుత డీఎస్సీ నిర్వహణలో లీకేజీల దగ్గర నుంచి అనేక అవకతవకలు బయటపడుతున్నాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థులకు కూడా ఉద్యోగాలు రాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రాలేదనే నెపంతో ఫస్ట్ ర్యాంకర్లను పక్కన పెట్టారని ప్రభుత్వం చెబుతుంటే.. మరి అదే అభ్యర్థులు న్యాయం కోసం కోర్టులను ఎందుకు ఆశ్రయిస్తున్నారని ప్రశ్నించారు. అభ్యర్థుల ఫిర్యాదులకు ప్రభుత్వం నుంచి సరైన సమాధానాలు కరవయ్యాయని, అధికారుల తీరులో తీవ్ర లెక్కలేనితనం కనిపిస్తోందని జగన్ దుయ్యబట్టారు.

# అమరావతి స్మార్ట్ సిటీకి భాగస్వామ్యం..

- మొదటి పేజి తరువాయి

రవాణా, బ్యాంకింగ్ వ్యవస్థలకు అవసరమైన ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లు, స్మార్ట్ కార్డ్ మైక్రోచిప్‌ల తయారీ కోసం విశాఖపట్నంలో ఒక ఎలక్ట్రానిక్ కాంపోనెంట్ అసెంబ్లీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, దేశీయంగా పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), సోలార్ కన్వర్టర్ల మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని నెల్లూరులో సెమీకండక్టర్ పరికరాల తయారీ యూనిట్‌ను స్థాపించాలని ప్రతిపాదించారు.

ఇప్పటికే శ్రీసిటీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆటోమోటివ్, అసెంబ్లింగ్ పరిశ్రమలకు రోబోటిక్స్, ఆటోమేషన్ సేవలు అందించేందుకు ఎలిమెంట్ గ్రూప్ తమ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని లోకేష్ సూచించారు. దీనికి తోడు, కమ్యూనికేషన్, ఏరోస్పేస్ రంగాలకు అవసరమైన మాడ్యులర్ కాంపోనెంట్లపై దృష్టి సారిస్తూ వైజాగ్ హై-టెక్ కారిడార్‌లో ఒక మైక్రోఎలక్ట్రానిక్స్ డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి స్మార్ట్ సిటీ నిర్మాణంలో భాగంగా హార్డ్‌వేర్, ఐఓటీ మౌలిక సదుపాయాల కల్పనలో భాగస్వాములు కావాలని, ఇందుకు అవసరమైన మైక్రోకంట్రోలర్లు, డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సరఫరా చేయాలని కోరారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై ఎలిమెంట్ గ్రూప్ ప్రెసిడెంట్ ఖజోవ్ ఒలెగ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నామని, ఇప్పటికే భారత టెక్ సంస్థలతో కలిసి సెమీకండక్టర్ పంపిణీ నెట్‌వర్క్‌లను నడుపుతున్నట్లు వివరించారు. దక్షిణాసియా మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలు ఆకర్షణీయంగా ఉన్నాయని తెలిపారు. తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో ఈ ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించి, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఎలిమెంట్ గ్రూప్ ప్రతినిధులు హామీ ఇచ్చారు. మాస్కో కేంద్రంగా 2019లో ఏర్పాటైన ఎలిమెంట్

గ్రూప్, రష్యాలో అగ్రగామి సెమీకండక్టర్ సంస్థగా గుర్తింపు పొందింది. ఈ సంస్థకు 30కి పైగా డిజైన్, మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాలు ఉండగా, 9 వేల మందికి పైగా నిపుణులు పనిచేస్తున్నారు. 2025 ఆర్థిక సంవత్సరంలో సంస్థ సుమారు రూ. 5,090 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఈ భేటీతో ఏపీకి సెమీకండక్టర్ రంగంలో భారీ పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## ప్రాంతీయవాదం ఉగ్రవాదం అయితే... మీరే ఉగ్రవాదులు

ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. “ఆంధ్రరాష్ట్ర పునాదులపై ఏర్పడిందే అసలైన ప్రాంతీయవాదం. ప్రాంతీయవాదం ఉగ్రవాదం అయితే, మొదట మీరే ఉగ్రవాదులు అవుతారు” అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. నాటి రాచరికపు పాలన అంతమై, తెలంగాణ భారతదేశంలో విలీనం కావాలని ప్రాణాలర్పించి పోరాటం చేసిన జాతీయవాదులు తమ తెలంగాణ ప్రజలని నిరంజన్ రెడ్డి అన్నారు. నాటి కాలంలో తమను బలవంతంగా ఆంధ్ర ప్రాంతంతో విలీనం చేశారని.. ఆ తర్వాత జరిగిన అన్యాయాలు, దుర్మార్గాల నుంచి విడిపోవాలనే ఇక్కడి ప్రజలు పోరాడారు తప్ప, తెలంగాణ ప్రజలు ప్రాంతీయవాదులు కారని ఆయన తేల్చి చెప్పారు. పక్క రాష్ట్రాల నాయకులు వచ్చి మన గడ్డపై నిలబడి తెలంగాణ సమాజాన్ని వెక్కిరిస్తుంటే.. ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా మౌనంగా చూస్తున్న రేవంత్ రెడ్డి తెలంగాణకు పెద్ద ద్రోహి అని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ఈ వ్యవహారంలో మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించిన తీరును అభినందించిన ఆయన.. మిగతా మంత్రులు ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. “తెలంగాణ మంత్రుల నోళ్లకు ఏమైనా పక్షవాతం వచ్చిందా?” అని ఘాటుగా ప్రశ్నించారు.

రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్షాల మధ్య ఎన్ని రాజకీయ విభేదాలైనా ఉండొచ్చుని.. కానీ, పొరుగు రాష్ట్రాల నేతలు వచ్చి తెలంగాణను అవమానిస్తుంటే అందరూ ఏకతాటిపైకి వచ్చి ఖండించకపోవడం దారుణమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ తెలంగాణ ప్రజల పక్షానే నిలబడుతుందని స్పష్టం చేసిన ఆయన.. ప్రభుత్వ వైఫల్యాలను, తెలంగాణకు జరుగుతున్న అవమానాలను సోషల్ మీడియా వేదికగా గట్టిగా ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

## ఏపీకి ఐదు రోజుల పాటు వర్ష సూచన

- మొదటి పేజి తరువాయి

రాయలసీమ మీదుగా ఉత్తర తమిళనాడు వరకు ఒక ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాబోయే ఐదు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల బలమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. రుతుపవనాల విస్తరణతో ఎండల తీవ్రత తగ్గి, ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పట్టనున్నాయి.

# కోటి మందితో యోగాంధ్ర-2026: సీఎం చంద్రబాబు ప్రకటన

- మొదటి పేజి తరువాయి

కాదు, ప్రతి వ్యక్తి నిత్య సాధనగా మార్చుకోవాలి. ఈ లక్ష్యంతో జూన్ నెలను ‘యోగా నెల’గా ప్రకటిస్తున్నాం. జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయి” అని వివరించారు. ప్రధాన కార్యక్రమం అమరావతిలో కృష్ణానది పశ్చిమ బైపాస్ వంతెనపై 25 వేల మందితో నిర్వహిస్తామని, ప్రతి జిల్లా కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మందితో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాలో పోలీసు సిబ్బంది, కోనసీమలో రైతులు వంటి ప్రత్యేక వర్గాలతో పాటు ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి 56 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించి ‘యోగా-టూరిజం’ను ప్రోత్సహిస్తామన్నారు. యోగాంధ్ర-2026 విజయవంతం కోసం రూ.10 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించామని, స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను, 2.50 లక్షల మంది ట్రైనర్లను తయారు చేయడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సలహాలు, సేవలు తీసుకుంటున్నామని, ఆయన రూపొందించిన 168కి పైగా వీడియోలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 81424 04888 వాట్సాప్ నంబర్‌కు ‘ఎ’ అని మెసేజ్ పంపిస్తే యోగా వీడియోలు పొందవచ్చని సూచించారు.

ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా yogandhra.ap.gov.in పోర్టల్‌ను ప్రారంభించామని, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఇషా ఫౌండేషన్, బ్రహ్మకుమారీస్ వంటి సంస్థల భాగస్వామ్యం కూడా తీసుకుంటున్నట్లు సీఎం వెల్లడించారు. గతేడాది యోగాంధ్ర కార్యక్రమానికి 2.44 కోట్ల మంది నమోదు చేసుకున్న స్ఫూర్తితో ఈసారి కూడా కార్యక్రమాన్ని విజయవంతం చేసి, యోగాను 365 రోజుల ఉద్యమంగా కొనసాగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు.

## కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం.. హాజరైన రాహుల్, ఖర్గే

కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లోని గ్లాస్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ ఆయనతో ప్రమాణం చేయించారు. డీకే శివకుమార్ రాజ్యాంగం చేతపట్టుకుని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, మల్లు భట్టివిక్రమార్క తదితరులు హాజరయ్యారు. డీకే శివకుమార్ కేబినెట్‌లో మాజీ సీఎం సిద్ధరామయ్య తనయుడు యతీంద్రకు చోటు దక్కింది. పరమేశ్వర ఏకైక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కర్ణాటక కొత్త మంత్రివర్గంలో 12 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తనకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారని డీకే శివకుమార్ వెల్లడించారు. పార్టీలో అందరినీ కలుపుకుని ముందుకు సాగాలని ఆమె సూచించినట్లు తెలిపారు. తన నాయకత్వంపై సోనియా గాంధీ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు డీకే శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ, “సోనియా గాంధీ నాతో ఫోన్‌లో మాట్లాడారు. మొదటి నుంచి నాపై ఆమెకు చాలా నమ్మకం ఉంది. నన్ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది సోనియానే. అందరినీ కలుపుకుని పనిచేయాలని ఆమె సూచించారు. ఆమె నమ్మకాన్ని నిలబెడతానని, అందరినీ కలుపుకుని ముందుకు వెళతానని నేను హామీ ఇచ్చాను” అని వివరించారు.

# భారత్‌పై అమెరికా మళ్లీ టారిఫ్స్..

- మొదటి పేజి తరువాయి

సెక్షన్ 301 కింద అదనపు సుంకాలు విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదించిన విషయం తెలిసిందే.

దీనిపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పందిస్తూ అమెరికాతో వాణిజ్య ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు చర్చలు కొనసాగుతున్నాయని తెలిపింది. ఈ పన్నుల ప్రతిపాదన ఇంకా ప్రజాభిప్రాయ సేకరణ దశలోనే ఉందని పేర్కొంది. సంబంధిత వర్గాలు 2026 జూన్ 22లోపు తమ విజ్ఞప్తులను సమర్పించవచ్చని, జులై 7 తర్వాతే అమెరికా తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేసింది.

ఇప్పటికే సెక్షన్ 232 కింద ఉన్న కొన్ని ఉత్పత్తులకు ఈ కొత్త పన్నుల నుంచి మినహాయింపు లభించింది. అలాగే టెక్స్‌టైల్ రంగానికి అమెరికా ప్రత్యేక వెసులుబాటును ప్రతిపాదించింది. దీని ప్రకారం

నిర్దేశిత పరిమాణంలోని దుస్తుల దిగుమతులపై తక్కువ పన్ను రేట్లు విధించే అవకాశం ఉంది. పరస్పర వాణిజ్య ఒప్పందాలు అంగీకరించే దేశాలకు ఈ పన్ను 10 శాతంగా ఉంటుంది. ప్రస్తుతానికి చర్చలు నడుస్తున్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భారత్ వెల్లడించింది.

## పవన్‌పై వ్యాఖ్యలు కరెక్ట్ కాదు..

తెలంగాణలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సరైన పద్ధతి కాదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. ఇలాంటి మాటలతో అనవసర సమస్యలు సృష్టించవద్దని, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు ఫలించవని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో తన యూనిట్‌ను ఏర్పాటు చేసుకుందని చంద్రబాబు గుర్తుచేశారు. అప్పుడు ఏపీలో ఎలాంటి అభ్యంతరాలు తెలపలేదన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయి ఇప్పటికే 12 ఏళ్లు దాటిపోయిందని.. ఈ సుదీర్ఘ కాలంలో ఎవరెవరు ఏం చేశారనేది రెండు రాష్ట్రాల ప్రజలకు చాలా స్పష్టంగా తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. ఏవైనా సమస్యలు లేదా భేదాభిప్రాయాలు ఉంటే రాజకీయంగా, లాజికల్‌గా ముందుకెళ్లాలి తప్ప.. ఇలాంటి వ్యాఖ్యలతో రాష్ట్రాల్లో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టవద్దని సూచించారు. “తెలంగాణలో పవన్ కళ్యాణ్ గారిపై కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సరైన పద్ధతి కాదు. ఇలాంటి మాటలు మాట్లాడి లేనిపోని సమస్యలు సృష్టించకూడదు. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత ఇప్పుడు అనవసరంగా మాట్లాడి విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నారు. కానీ అది సాధ్యం కాదు. ఏ ప్రాంతానికి ఎవరు ఏం చేశారో ప్రజలకు బాగా తెలుసు. నేను ఇటీవలే తమిళనాడులో ఎన్నికల ప్రచారానికి వెళ్లి వచ్చాను. అక్కడకు కర్ణాటకతో పాటు దేశంలోని అన్ని ప్రాంతాల నేతలు వచ్చారు. కర్ణాటక నుంచి డీకే శివకుమార్ కూడా వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉన్నాయి. ఆ బీఆర్ఎస్ జాతీయ పార్టీ అని చెప్పి ఆంధ్రప్రదేశ్‌లో కూడా విస్తరిస్తామని అన్నారు. మరి ఇప్పుడు ఎందుకిలా మాట్లాడుతున్నారో నాకైతే అర్థం కావడం లేదు. ఇది సరైన విధానం కాదు. ఈ రోజు అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వంటి దేశాల్లో ఎంతోమంది తెలుగువారు రాజ్యాంగ పదవుల్లో ఉన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లో మనవాళ్లు పదవులు చేపట్టి, అక్కడి రాజ్యాంగం ప్రకారం పనిచేస్తున్నారు. ప్రజలకు ఎవరు మంచి సేవ చేస్తే వారే ఆయా ప్రాంతాల్లో నాయకులు అవుతారు. రాజకీయ నాయకులు అభివృద్ధిలో, ప్రజా సేవలో పోటీ పడాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై దృష్టి పెట్టాలి. అంతేకానీ ఇలాంటి విమర్శలతో ప్రజల మధ్య దూరం పెంచకూడదు” అని చంద్రబాబు హితవు పలికారు.

# ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం.. 21 మంది సజీవ దహనం

- మొదటి పేజి తరువాయి

వరకు 40 మందిని కాపాడారు. మాలవీయనగర్‌లోని లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఉదయం 9 గంటల సమయంలో మంటలు చెలరేగుతున్నట్లు గుర్తించారు.

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు షార్ట్ సర్క్యూటే కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా


నిర్ధారించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స కోసం రూ.50 వేలు అందజేస్తామన్నారు.

## తెలంగాణ ప్రజల్లో ‘తెలంగాణ’ అనే భావన ఉంటుంది... కానీ ఆంధ్రా ప్రజల్లో ‘ఆంధ్రా’ అనే భావన లోపించింది

- మొదటి పేజి తరువాయి

ఉప ప్రాంతీయతలు, కులాల ప్రాబల్యం ఎక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడిన పవన్, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య ఉన్న ప్రాంతీయ అస్తిత్వంపై ఆసక్తికర విశ్లేషణ చేశారు. “తెలంగాణ ప్రజలను చూస్తే ఎందుకు ముచ్చటేస్తుందంటే, వారిలో తెలంగాణ అనే భావన ఉంటుంది. తమిళులకు వారి భాషా, ప్రాంతంపై అభిమానం ఉంటుంది. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో ‘ఆంధ్రా’ అనే ఉమ్మడి భావన కొరవడింది. ఇక్కడ సబ్-రీజనలిజం, కులతత్వమే ఎక్కువ” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను ‘జై ఆంధ్ర’ అని నినాదం ఇచ్చింది కూడా అందుకేనని పవన్ స్పష్టం చేశారు. కనీసం ‘మేమంతా ఆంధ్ర’ అనే ఒక ఉమ్మడి గుర్తింపు రాష్ట్ర శ్రేయస్సు కోసం అవసరమని తాను భావిస్తున్నట్లు తెలిపారు. తన సూచనను ఉన్మాద స్థాయికి తీసుకెళ్లమని కాకుండా, రాష్ట్రం కోసం కనీస ఐక్యతను పెంపొందించుకోవాలనే ఉద్దేశంతోనే ఆ మాట చెప్పానని వివరించారు. ఈ రకమైన ఉప ప్రాంతీయతలతో రాష్ట్రం ఇప్పటికే అన్ని రకాలుగా విడిపోయిందని, ఇకనైనా కలపడానికే ప్రయత్నించాలని ఆయన అన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసిన మురళీకృష్ణంరాజు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూన్ 3:** తాడేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసిపి అధ్యక్షులు,మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డిని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్,నారాయణరెడ్డి తదితరులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో పలు పార్టీ కార్యక్రమాలు,నియోజకవర్గ అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున ముదునూరి మురళీ కృష్ణంరాజు చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అభినందించినట్లు మురళీ కృష్ణంరాజు క్యాంపు కార్యాలయం తెలిపింది.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## పలు సేవా కార్యక్రమాల్లో ......

### ఏలేశ్వరం మండల పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి.





**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 3:** మండల పరిధి జె. అన్నవరం గ్రామంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) బుధవారం పాల్గొన్నారు. జె.అన్నవరం గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి హామీ శ్రామికులకు ఎంపీపీ (బుజ్జి) మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రస్తుత వేసవి దృష్ట్యా శ్రీ సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ కార్యక్రమం చేపట్టారు. ఎండ వేడిమి నుంచి కూలీలకు ఉపశమనం కలిగించేందుకు మజ్జిగ అందించామని ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.టి.సి సభ్యులు, గ్రామ టీడీపీ నాయకులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల నుంచి మలేరియాను తరిమికొట్టాలి: మండల పరిధిలో గ్రామాల నుంచి మలేరియాను పూర్తిగా తరిమి కొట్టాలని ఎంపీపీ పిలుపునిచ్చారు.
జె.అన్నవరంలో నిర్వహించిన మలేరియా వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో పార్టీ శ్రేణులతో కలిసి ఎంపీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
గతంలో అవగాహన లేక మలేరియా కారణంగా అనేకమంది మృత్యువాత పడేవారన్నారు. ప్రస్తుతం సైన్స్ అభివృద్ధి చెందింది, ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించే దిశగా గ్రామాల్లో పిహెచ్సి లను నిర్మించి ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ శ్రేణులు, డాక్టర్, హాస్పిటల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధుల్లో కలిసి పిహెచ్సి బిల్డింగ్ నిర్మాణ పనులను ఎంపీపీ పరిశీలించారు. త్వరిత గతిన పిహెచ్సి నిర్మాణం పూర్తిచేసి, ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అలార్క రాజు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## పీఎం కేర్స్ పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుంది





### జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,జూన్ 3:** కోవిడ్-19 మహమ్మారి కారణంగా తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. పీఎం కేర్స్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న పిల్లలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, మిషన్ వాత్సల్య పథకం జిల్లా బాలల సంరక్షణ విభాగం నిర్వహించిన పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ లబ్ధిదారుల ముఖాముఖి సమావేశం"లిలిలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్. లక్ష్మితో కలిసి లబ్ధిదారులైన చిన్నారులతో ముచ్చటించి వారి విద్య, ఆరోగ్యం, సంరక్షకుల వివరాలు, ఇతర సంక్షేమ అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పీఎం కేర్స్ కింద లబ్ధి పొందుతున్న పిల్లలు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ అలవర్చుకుని చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక, విద్యా ప్రోత్సాహకాలను వినియోగించుకుని తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.కాకినాడ జిల్లాలో ప్రస్తుతం 24 మంది పిల్లలు పీఎం కేర్స్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, వీరి సంరక్షణను జిల్లా బాలల సంరక్షణ విభాగం నిరంతరం పర్యవేక్షిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ లబ్ధిదారులందరికీ పీఎం కేర్స్ కింద రూ.10 లక్షలు, సీఎం కేర్స్ కింద మరో రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించబడుతోందని, అదనంగా రూ.5 లక్షల విలువైన ఆయుష్మాన్ భారత్ ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం కల్పించబడుతోందని పేర్కొన్నారు.
ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్. లక్ష్మి మాట్లాడుతూ, పీఎం కేర్స్ పథకం ద్వారా లబ్ధిదారులకు 18 ఏళ్ల వయస్సు నుంచి నెలవారీ స్టైఫండ్, 23 ఏళ్ల వయస్సులో రూ.10 లక్షల కార్పస్ ఫండ్, ఉచిత కేంద్రీయ విద్యాలయ ప్రవేశాలు, ఉన్నత విద్య కోసం రుణ సదుపాయాలు, వైద్య సహాయం వంటి పలు ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని పిల్లలకు సూచించారు.అనంతరం ఐసీడీఎస్ అధికారులు, జిల్లా లీడ్ బ్యాంకు అధికారి సీహెచ్ఎస్వీ ప్రసాద్ కలిసి లబ్ధిదారులకు ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, బ్యాంకింగ్ సేవల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి సీహెచ్. వెంకటరావు, సీడీపీవోలు పి. వెంకటలక్ష్మి, వై. లక్ష్మి, పీఓఎన్ఐసీ జె. విజయ్, కౌన్సిలర్ బి. దుర్గా, సోషల్ వర్కర్లు ఎస్. చిన్నబాబు, కె. రాంబాబు, ఐసీడీఎస్ సిబ్బంది, లబ్ధిదారుల సంరక్షకులు తదితరులు పాల్గొన్నారు.




## సింహాద్రిపురం మలుపులో గుర్తుతెలియని వ్యక్తి మృతి.



కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 3:మండల కేంద్రమైన కిర్లంపూడి నుండి సింహాద్రిపురం వెళ్లే దారి మలుపులో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మోటార్ సైకిల్ పై వేగాన్ని కంట్రోల్ చేయలేక బైక్ తో పాటు కాలువలో పడిపోవడంతో మృతి చెందినట్లు కిర్లంపూడి పోలీసులు తెలిపారు.
మృతుడు వివరాలు తెలియాల్సి ఉంది.ఘటనా స్థలానికి కిర్లంపూడి పోలీసు చేరుకుని వివరాలు మృతి చెందిన వ్యక్తి వివరాలను సేకరిస్తున్నారు. మృతదేహాన్ని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఉన్న మార్చురీ మార్చురీకి తరలించినట్లు కిర్లంపూడి పోలీసులు తెలిపారు.

## కుయ్యేరు--కాజులూరు రహదారి అభివృద్ధికి రూ.2.78 కోట్లు మంజూరు



**కాజులూరు,జూన్ 3 ,పెన్ పవర్:** రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కుయ్యేరు--కాజులూరు రహదారి అభివృద్ధికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో కీలక ముందడుగు పడింది. నిధుల కొరత కారణంగా నిలిచిపోయిన ఈ రహదారి నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం రూ.2.78 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.సుమారు 12.16 కిలోమీటర్ల పొడవు కలిగిన ఈ రహదారి కుయ్యేరు, కాజులూరు ప్రాంతాల ప్రజలకు ప్రధాన రవాణా మార్గంగా ఉపయోగపడుతోంది. రహదారి దెబ్బతినడంతో స్థానిక ప్రజలు, రైతులు, వాహనదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు.రహదారి నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుపై మంత్రి సుభాష్ పలుమార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించడంతో పాటు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లారు. ఆయన నిరంతర అనుసరణ, పట్టుదల ఫలితంగానే ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రూ.2.78 కోట్ల నిధులను విడుదల చేసినట్లు తెలుస్తోంది. అధికారుల సమాచారం ప్రకారం రహదారి నిర్మాణ పనులు వారం రోజుల్లోపు ప్రారంభం కానున్నాయి. పనులు పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభతరం కానుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఈ రహదారి కీలకంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ప్రజల అవసరాలే ప్రభుత్వ ప్రాధాన్యత అని, రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి ప్రతి గ్రామానికి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో నియోజకవర్గ ప్రజలు,ప్రజాప్రతినిధులు,రైతు సంఘాల నాయకులు, వివిధ వర్గాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి వరుసగా నిధులు సాధించడం ద్వారా మంత్రి అభివృద్ధి పట్ల తన చిత్తశుద్ధిని చాటుతున్నారని స్థానికులు పేర్కొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## శివకుమార్ మృతి బాధాకరం.

### కుటుంబ సభ్యులను ఓదార్చిన బండారు శ్రీనివాస్



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 03;** ఇటీవల పెనికేరు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు యర్ర హేమ శివకుమార్ కుటుంబ సభ్యులను కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. శివకుమార్ నివాసానికి వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను కలిసి ప్రమాద ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కొడుకు మరణాన్ని తట్టుకోలేక తీవ్ర దుఃఖంలో ఉన్న తండ్రిని బండారు శ్రీనివాస్ ఓదార్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, జరిగిన విషాదాన్ని జీర్ణించుకోవాలని కుటుంబ సభ్యులందరూ ధైర్యంగా ఉండాలని సూచించారు. శివకుమార్ అకాల మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో జనసేన పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని బండారు శ్రీనివాస్ హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఆయన వెంట స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని శివకుమార్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

## మధ్యాహ్న భోజన నిర్వాహకులకు నేడు ప్రత్యేక శిక్షణ

* అగ్నిప్రమాదాల నివారణపై ఫైర్ సిబ్బందితో ప్రత్యక్ష ప్రదర్శన



**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 3:**ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు సురక్షితమైన ఆహారం అందించే లక్ష్యంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సహాయక సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారులు పి. వరప్రసాదరావు, ఎ. సత్యనారాయణ తెలిపారు. గురువారం (జూన్ 4) ఉదయం 9 గంటలకు ఉచ్చిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరగనుంది. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు, వంట కార్మికులు, సహాయక సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, ఆహార పదార్థాల నిల్వ, నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత, విద్యార్థులకు అందించే భోజనం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారుల ద్వారా అవగాహన కల్పించనున్నారు. అలాగే వంటశాలల్లో ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన భద్రతా ప్రమాణాలపై కూడా ప్రత్యేకంగా సూచనలు ఇవ్వనున్నారు. ముఖ్యంగా వంట జరుగుతున్న సమయంలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా స్పందించాలి, ప్రమాదాలను ఎలా నివారించాలి, ప్రాథమిక రక్షణ చర్యలు ఏమిటి వంటి అంశాలపై అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రత్యక్ష ప్రదర్శన (డెమో) నిర్వహించనున్నారు. అగ్నిమాపక పరికరాల వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలను నిర్వాహకులకు వివరించనున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగకరంగా ఉంటుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న ప్రతి నిర్వాహకుడు, సహాయక సిబ్బంది తప్పనిసరిగా హాజరై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల వంటశాలల్లో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడటంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన సేవలు అందించడానికి దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## జగన్మోహిని కేశవస్వామిని దర్శించుకున్న భక్తులు

* అన్నదానానికి 6,116 రూ విరాళం






**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 3:**కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వెలసిన ప్రాచీన ప్రసిద్ధి గాంచిన శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో బుధవారం వేకోజమున స్వామి వారి మేలుకొలుపు సేవ సుప్రభాత సేవ అలంకారం ఉత్సవం అత్యంత వైభవంగా అర్చకులు నిర్వహించారు 11వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయం తన విశిష్టతతో దేశ విదేశాల భక్తులను ఆకర్షిస్తోంది. స్వామివారు ముందు భాగంలో మహావిష్ణు రూపంలో, వెనుక భాగంలో జగన్మోహిని రూపంలో దర్శనమివ్వడం ఈ క్షేత్రానికి ప్రత్యేకతగా నిలిచింది. అలాగే స్వామివారి పాదాల మధ్య నుంచి నిత్యం జలధార ఉబికి రావడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

బుధవారం సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఐదు వరుస బుధవారాలు ఐదు ప్రదక్షిణలు చేస్తే కోరుకున్న కోరికలు నెరవేరుతాయనే విశ్వాసంతో భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన నిత్య అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దువ్వాడ గ్రామానికి చెందిన శెట్టి రాంబాబు, అరుణకుమారి దంపతులు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి, గోపాలస్వామివారిని దర్శించుకుని ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి రూ. 6,116 విరాళంగా అందజేశారు. వారికి ఆలయ వేదపండితులు వెంకట అవధాని వేదాశీర్వచనం అందించగా, ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌ఛార్జి ఈవో ద్వారపురెడ్డి సురేష్‌బాబు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ర్యాలి క్షేత్ర మహిమను తెలుసుకున్న భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి కూడా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

# ర్యాలి లో 'వజ్రప్రహార్'.. గంజాయి, నేరాలపై పోలీసుల ఉక్కుపాదం





* కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్

**పెన్ పవర్, ఆత్రేయపురం జూన్ 3:**మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం రవాణా, నేరాల నియంత్రణ లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ చేపట్టిన 'ఆపరేషన్ వజ్రప్రహార్'లో భాగంగా కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో బుధవారం తెల్లవారుజామున విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్ఐ ఎస్. రాము పోలీసు సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.

ఉదయం 6 గంటల ప్రాంతంలో ప్రారంభమైన ఈ తనిఖీల్లో గ్రామంలోని అనుమానిత ప్రాంతాలను జల్లెడ పట్టారు. వాహనాల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ లేకుండా నడుపుతున్న వాహనాలపై చలానాలు విధించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచి, గంజాయి , ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి సంబంధించిన వివరాలను సేకరించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ సుంకర మురళీమోహన్ మాట్లాడుతూ గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే రాష్ట్ర ప్రభుత్వ, పోలీసు శాఖల ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వంద ప్రాంతాల్లో ఏకకాలంలో 'ఆపరేషన్ వజ్రప్రహార్' నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కల్పించడం, అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

గ్రామ యువతతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన పోలీసులు గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. మాదకద్రవ్యాలకు బానిసైన వ్యక్తులు కుటుంబాలతో పాటు సమాజానికి కూడా ప్రమాదకరంగా మారే అవకాశముందని హెచ్చరించారు. మహిళలపై వేధింపులు, దొంగతనాలు, ఘర్షణలు వంటి నేరాలకు మత్తు పదార్థాల వినియోగం ఒక ప్రధాన కారణంగా మారుతోందని తెలిపారు.

అలాగే దొంగ వాహనాల కొనుగోలు, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామాల్లో గంజాయి విక్రయాలు, డ్రగ్స్ వినియోగం లేదా ఇతర అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల సహకారం లేకుండా మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యం కాదని, "మన ఊరి భద్రత మన చేతుల్లోనే ఉంది" అని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం ఎస్ఐ చంటిబాబు, కొత్తపేట అదనపు ఎస్ఐ వెంకటేశ్వరరావు, కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం, రావులపాలెం పోలీసు స్టేషన్ల పరిధిలోని ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. 'ఆపరేషన్ వజ్రప్రహార్' ద్వారా నేరాల నియంత్రణతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యమని పోలీసులు స్పష్టం చేశారు.




## కూటమి ప్రభుత్వం ప్రజావంచన పాలనకు రెండేళ్లు.

-పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రత్తిపాడు వైసిపి ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు.



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 3:**కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో ప్రజలను వంచించి, ఆంధ్రప్రదేశ్‌కు వెన్నుపోటు పొడిచి రెండేళ్లు పూర్తవుతుందని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు.


బుధవారం ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మండల కన్వీనర్లు, పలువురు వైసిపి ముఖ్య నాయకులు కార్యకర్తలతో కలిసి కిర్లంపూడి ముద్రగడ నివాసంలో వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో రూపొందించిన నిరసన పోస్టర్‌ను ఆవిష్కరించారు.?ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు పలువురు వైసిపి నేతలు మాట్లాడుతూ.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల మోసపూరిత పాలనను, అమలుకాని వారి మేనిఫెస్టోను నిరసిస్తూ జూన్ 4 నుండి జూన్ 12 వరకు నియోజకవర్గంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు ప్రకటించారు.?జూన్ 4 న మండల కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో టీడీపీ మేనిఫెస్టో, చంద్రబాబు మరియు పవన్ కళ్యాణ్ సంతకాలు చేసిన బాండ్లు, వారి అబద్ధపు పత్రికా ప్రకటనల కాపీలను దహనం చేసే కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు.

జూన్ 8 న నియోజకవర్గ స్థాయిలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలపై "వెన్నుపోటుకు రెండేళ్లు" అనే పేరుతో ప్రత్యేక టౌన్ హాల్ సదస్సును ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

జూన్ 12 న నియోజకవర్గ వ్యాప్తంగా చంద్రబాబు రెండేళ్ల వెన్నుపోటు పాలనకు నిరసనగా నియోజకవర్గంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఈ నిరసన కార్యక్రమాలను జూన్ 12న జరగబోయే భారీ ర్యాలీని దిగ్విజయం చేయడానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మరియు ప్రజా సంఘాలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామిశెట్టి నాని, నరాల శ్రీను, గొల్లపల్లి సురేష్,బెహరా దొరబాబు, గుడాల వెంకటరత్నం,శేరు కృష్ణ, ఏడిద రెడ్డి నాయుడు, అడపా సోమేశ్, సకురు గుర్రాజు,గొంతిరెడ్డి సతీష్ నియోజకవర్గంలోని పలు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీలోని రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఘనంగా ముగిసింది



**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 3:**గండేపల్లి మండలం సూరంపాలెం యూనివర్సిటీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం నందు"గూగుల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్" అనే అంశంపై రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ జూన్ 3 వ తేదీన ఘనంగా ముగిసినట్లు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్ గా గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ లీడ్ మిస్ ఇషా పోర్వాల్, మరియు గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ పార్ట్నర్ 'అప్ ఎడ్యుకేటర్స్' లీడ్ ట్రైనర్ మిసెస్ ఆర్తి కుమారన్ వ్యవహరించారు. ప్రస్తుత ఆధునిక విద్యా విధానం, పరిశ్రమల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యత ను గుర్తించి అధ్యాపకులకు ఈ శిక్షణ ను ఏర్పాటు చేశారు. సాంప్రదాయ బోధనా పద్ధతుల స్థానంలో సరికొత్త టెక్నాలజీని జోడించి బోధన, పరిశోధనలు, కంటెంట్ క్రియేషన్, కోడింగ్ మరియు డేటా అనాలిసిస్ వంటి రంగాల్లో అధ్యాపకులకు పూర్తి స్థాయి ప్రాక్టికల్ అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. దీని ద్వారా క్లాస్‌రూమ్ టీచింగ్, విద్యార్థుల ప్రాజెక్టులలో, రీసెర్చ్ పబ్లికేషన్స్ లో ఈ టూల్స్‌ను సమర్థవంతంగా ఉపయోగించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్. రమాశ్రీ, ప్రో వైస్-ఛాన్సలర్ (ఇంజనీరింగ్ & సైన్సెస్) డాక్టర్ ఎ రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి సురేష్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం వి రాజేష్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ మాకినీడి రాజా బాబు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కర్ణం శ్రీను మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఆదిత్య విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఏఐ టూల్స్ బై కేపీఎంజీ'అనే అంశంపై వర్క్ షాప్






**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 3:**గండేపల్లి మండలం సూరంపాలెం లో గల ఆదిత్య విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఏఐ టూల్స్ బై కేపీఎంజీ'అనే అంశంపై మూడు రోజుల అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం (ఎఫ్ డి పి ) ఘనంగా ప్రారంభమైంది అని డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్‌గా అమిత్ చౌదరి మరియు ఆయుష్మాన్ ఘోష్ పాల్గొని శిక్షణ అందించారు. మొదటి రోజు ఆదిత్య విశ్వవిద్యాలయంలో వివిధ రకాల ఏఐ పరికరాలు (ఏఐ టూల్స్ ) మరియు వాటి ఉపయోగాలు గురించి వివరించారు. ప్రస్తుత సమాజంలో, ముఖ్యంగా విద్యా బోధనా రంగంలో ఏఐ టూల్స్ పాత్ర ఎంత ముఖ్యమైనదో వారు క్లుప్తంగా తెలియజేశారు. ఈ రోజుల్లో 'ప్రాంప్ట్ ఇంజినీరింగ్' అనే అంశంపై అధ్యాపకులు పట్టు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ రంగంలో చేసిన పరిశోధనలు భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని నిపుణులు ఉదాహరణలతో వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆదిత్య విశ్వవిద్యాలయానికి చెందిన సుమారు 100 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం అధ్యాపకులు తమకు ఉన్న పలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో-చాన్సెలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్-చాన్సలర్ డా. ఎం. బి. శ్రీనివాస్, ప్రో వైస్-చాన్సలర్ (అకాడమిక్స్) డా. ఎస్. రమాశ్రీ, ప్రో వైస్ చాన్సలర్ (ఇంజనీరింగ్ మరియు సైన్సెస్) డా. ఎ. రమేష్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అసోసియేట్ డీన్ డా. ఎం.వి. రాజేష్, ఫ్రెష్మన్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్అసోసియేట్ డీన్,డా.ఎ.వానతి, పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో వంటలు నిర్వహణపై శిక్షణ

**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 3:** డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా పాఠశాలల యందు విద్యార్థులకు భోజనములు వండే కుకింగ్ కం హెల్పర్స్ కు విద్యాశాఖ ఆదేశముల మేరకు ఒకరోజు శిక్షణా కార్యక్రమము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్లేపల్లి నందు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగినది శిక్షణా కార్యక్రమంనకు గండేపల్లి మండలంలోని 41 పాఠశాలల నుండి సుమారు 50 మంది వంట నిర్వాహకులు పాల్గొన్నారు కార్యక్రమంనకు జిల్లా విద్యాశాఖ నుండి నోడల్ అధికారి శ్రీ శివరామకృష్ణ హాజరై పరిశుభ్రమైన వంట ఆహార భద్రత వ్యక్తిగత పరిశుభ్రత మధ్యాన్ని భోజన పథకం యొక్క రికార్డులు నిర్వహణ పోషక విలువలు మొదలైన వాటి గురించి అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చినారు అనంతరము వంట నిర్వాహకులకు వివిధ రకములైన వంటల పోటీలు నిర్వహించుట జరిగినది ఈ పోటీల యందు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఈ నాయకంపల్లి, నీలాద్రి రావు పేట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పి, సూరంపాలెం,మురారి, గండేపల్లి,మల్లేపల్లి స్కూల్స్ నుండి వంటల నిర్వాహకులు వివిధ రకములైన వంటలను రుచికరముగా వండి చక్కటి ప్రతిభ కనపరిచినారు కార్యక్రమంలో మల్లేపల్లి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ శ్రీమతి అన్నపూర్ణ మండల విద్యాశాఖ అధికారులు కే హెచ్ నాయక్ మరియు కె వెంకటరెడ్డి పాల్గొనినారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కిర్లంపూడి వెలుగు కార్యాలయంలో మన డబ్బులు,మన లెక్కలు యాప్ పై శిక్షణా కార్యక్రమం.

-పలు,సలహాలు సూచనలు అందజేసిన డిఆర్డిఏ,పిడి,జి శ్రీనివాసరావు.



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 3:** మండల కేంద్రమైన కిర్లంపూడి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం మండలంలోని విఓఏ లకు, గ్రామ సంఘాల లీడర్లకు మన డబ్బులు, మన లెక్కలు యాప్ పై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం శరకణం వేదకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డి ఆర్ డి ఏ, పి డి,జి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లీగల్ కోఆర్డినేటర్ ఏ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో పి డి,జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి నెల డ్వాక్రా సంఘాల మహిళల యొక్క ఫోన్లోనే అప్పు ఎంత ఉంది, పొదుపు ఎంత ఉంది ఏ నెలలో ఎంత రుణం చెల్లించారో సభ్యురాలి పూర్తి సమాచారం తెలుసుకోవడమే మన డబ్బులు,మన లెక్కలు సారాంశం అన్నారు.అలాగే డ్వాక్రా మహిళలు తయారు చేసిన వివిధ సేవలను ఈ యాప్ లో పొందుపరచుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు ఎల్ సి రామకృష్ణ, సీసీలు, ఎన్ బుల్లియ్య,వై లోవరాజు, ఎన్ శాంత, అకౌంటెంట్, డి సంధ్య, మండలంలోని వివోఏలు, గ్రామ సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

## ఒంటితాడి గ్రామ సమస్యల పరిష్కారానికి గ్రామస్తులు, కౌలు రైతుల సంఘం ధర్నా



**కాజులూరు, పెన్ పవర్ జూన్ 3:** కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఒంటితాడి గ్రామంలో నెలకొన్న పలు మౌలిక సదుపాయాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ ప్రజలు, ఏపీ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లు రాజబాబు మాట్లాడుతూ, గత పదేళ్లకు పైగా గ్రామంలో తీవ్రమైన మంచినీటి సమస్య కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం గ్రామ పెద్దలు ట్యాంకర్ల ద్వారా రెండు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ అది ప్రజల అవసరాలకు సరిపోవడం లేదని పేర్కొన్నారు. ప్రతి రోజూ తగినంత తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని, జలజీవన్ మిషన్ కింద ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌లో ఉన్న లోపాలను ఆర్డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. గ్రామంలో మురుగు నీటి పారుదల కోసం సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే మురుగునీరు, వర్షపు నీరు రోడ్లపై నిలిచి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని తెలిపారు. అలాగే బీసీ స్మశానవాటికకు వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, అక్కడికి సీసీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. 1996కు ముందు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారాయని, వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో అధికంగా ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలు నివసిస్తున్నాయని, శిథిలమైన పాత పెంకుటిళ్లలో జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వం కొత్త ఇళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.



అదేవిధంగా 60 సంవత్సరాలు పూర్తిచేసుకున్న అర్హులైన వృద్ధులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని, గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పూల భైరవస్వామి, దండంగి సమర్పణరావు, పొన్నాడ లక్ష్మి, పాలెపు రమణ, సంగాడి అన్నపూర్ణ, కొక్కిలిగడ్డ నాగమణి, బుడపాని దర్గా, రెడ్డి రమణరెడ్డి, సత్యనారాయణ, సంగాడి బూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్థాయిలో కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

టిడిపి అల్లవరం మండలం అధ్యక్షుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు



**అల్లవరం,పెన్ పవర్, జూన్ 03:** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని అల్లవరం టిడిపి అధ్యక్షుడు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు అన్నారు. అల్లవరం మండల పరిధిలోని మూడు క్లస్టర్ల పరిధిలోని 12 యూనిట్ల నాయకులతో కలిసి ఆయా గ్రామాల్లో బుధవారం సమావేశాలు నిర్వహించారు. క్షేత్రస్థాయి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సంస్థాగత సమన్వయాన్ని బలోపేతం చేయడంతోపాటు ప్రజల అవసరానికి అనుగుణంగా మౌలిక వసతులు మెరుగుపరచడం, పార్టీ కార్యాచరణ ప్రణాళికలపై ఎప్పటికప్పుడు చర్చించి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మండలంలోని మూడు క్లస్టర్ పరిధిలో కోడూరుపాడు, డి.రావులపాలెం, బెండమూర్లంక, తూర్పులంక, దేవగుప్తం, అల్లవరం, ఓడలరేవు, మొగల్లమూరు, గోడి, బోడసకుర్రు, తాడికొన గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కదలి వెంకటేశ్వరరావు , మండల కార్యదర్శి పశ్చిమాల ఏడుకొండలు, నడింపల్లి సుబ్రహ్మణ్యంరాజు, వేగిరాజు వెంకటరాజు, కాకిలేటి సూరిబాబు, పోతుల నాగరాజు, నడింపల్లి నాగరాజు, అల్లూరి గోపాల కృష్ణం రాజు, గోసంగి స్టాలిన బాబు, నాతి లెనిన్ బాబు, నార్గాని శ్రీను, నూకపేయి రాంబాబు, కాండ్రేగుల సత్యనారాయణ, గిడుగు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాంధ్ర--ఉల్లాస్ కార్యక్రమం విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి



ఎంపీడీవో జె. రాంబాబు



**కాజులూరు, పెన్ పవర్,జూన్ 3:** వయోజన విద్య ను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అక్షరాంధ్ర--ఉల్లాస్ కార్యక్రమం అమలుపై కాజులూరు మండలంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె. రాంబాబు మాట్లాడుతూ, మండలంలో నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి వారికి విద్యా అవకాశాలు కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో వాలంటీర్లు, అర్హులైన వయోజనులను గుర్తించి వారి వివరాలను సేకరించాలని, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ లాగిన్‌లో నమోదు చేయాల్సిన సమాచారాన్ని పూర్తిస్థాయిలో నమోదు చేయాలని ఆదేశించారు. 2026--27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విధంగా కార్యాచరణ రూపొందించి, ప్రతి గ్రామంలో అక్షరాస్యత పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వయోజన విద్య ద్వారా నిరక్షరాస్యులకు చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు అందించడం ద్వారా వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. అక్షరాంధ్ర--ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి వయోజనుడిని కార్యక్రమంలో భాగస్వామి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

ఈ సమావేశంలో ఉల్లాస్ రిసోర్స్ పర్సన్ రాజేష్, సూపర్‌వైజర్ తేజేశ్వరరావు, కాజులూరు మండల డిప్యూటీ ఎంపీడీవో (ఎస్‌జీఎస్‌డబ్ల్యూఎస్), ఎంఈఓ--××, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఏపీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు శాఖ ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో కార్యక్రమం అమలు విధానం, లక్ష్యాల సాధన, డేటా నమోదు ప్రక్రియపై సవివరంగా చర్చించారు.

## గురువు సాయి రామకృష్ణ కి గణిత చదరం తో శుభాకాంక్షలు తెలిపిన సాయి వంశీ



| | | | |
|---|---|---|---|
| 21 | 8 | 19 | 14 |
| 18 | 15 | 20 | 9 |
| 12 | 17 | 10 | 23 |
| 11 | 22 | 13 | 16 |

**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 3:** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ నందు మీడియా మేనేజర్ గా పని చేస్తున్న తోటకూర గంగాధర్ తనయుడు ప్రస్తుతం బెంగళూరు క్యాప్ జెమినీ నందు పనిచేస్తున్న చి. తోటకూర వి.ఎస్.ఎస్. సాయి వంశీ తన గురువు,పెదనాన్న ప్రముఖ గణితావధాని జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ వద్ద గణితంలో అవధాన ప్రక్రియ, మాయా చదరాలు రూపొందించడంలో మెళుకువలను నేర్చుకొని పలు వేదికలపై గణిత అవధానం చేసి బాల గణితావధాని గా గణిత మేధావులు ప్రశంసలు అందుకుంటున్నాడు. లెక్కలపై "సాయి వంశీ" ఆసక్తిని గమనించి తన పెదనాన్న సాయి రామకృష్ణ గణితంలో మెళకువలు నేర్పి, తాను చేస్తున్న గణితావధాన ప్రక్రియను తన తమ్ముడి కుమారునికి నేర్పి అతని ద్వారా తన వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. పండుగలు,ప్రముఖుల పుట్టిన రోజులు తదితర పర్వదినాలలో ఎటు కూడిన ఆయా తేదీలను,లేదా సంవత్సరాలు వచ్చే విధంగా మ్యాజిక్ స్క్వేర్ లు రూపొందించి శుభాకాంక్షలు తెలపడం పరిపాటి. అంతే కాకుండా గణితావధానం తో పలు చోట్ల ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు పొందారు వంశీ నేడు తన గురువు,పెదనాన్న తోటకూర సాయి రామకృష్ణ (జూన్ - 4 - 64) 62 వ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని అడ్డు వరుసలు మొత్తం,నిలువు వరసలు మొత్తం,కర్ణాల మొత్తం ఇలా పలువిధాల ఎటు కూడిన 62 వచ్చే విధంగా 62 చదరాలు రూపొందించి శుభాకాంక్షలు తెలియజేసి తన గురువు పట్ల తన అభిమానాన్ని గౌరవాన్ని చాటుకున్నారు.

## ఆర్యావటం, తర్లంపూడిలో నేడు గ్రామసభలు



**కాజులూరు, పెన్ పవర్,జూన్ 4:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెలలో ప్రతి గురువారం ఒక గ్రామంలో మండల స్థాయి అధికారులతో కలిసి గ్రామసభ నిర్వహించే కార్యక్రమం కొనసాగుతోంది. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో ఈ గ్రామసభలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కాజులూరు మండల పరిధిలోని ఆర్యావటం గ్రామంలో జూన్ 4వ తేదీ గురువారం ఉదయం, అలాగే తర్లంపూడి గ్రామంలో మధ్యాహ్నం గ్రామసభలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ గ్రామసభలకు మండల తహసీల్దార్ అధ్యక్షత వహించనున్నారు.

గ్రామసభల్లో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, సంక్షేమ పథకాలు, భూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. కావున ఆయా గ్రామాల ప్రజలు గ్రామసభలకు హాజరై తమ సమస్యలు, అవసరాలను అధికారులకు తెలియజేసి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జి.ఆర్.ఠాగూర్ కోరారు.

# పేద కుటుంబానికి పెద్దన్నగా నిలిచిన మంత్రి సుభాష్



**కర్ణాటకలో మృతి చెందిన యువకుడి పార్థివ దేహాన్ని స్వగ్రామానికి రప్పించి.. ఆర్థిక సాయం అందించి కుటుంబానికి భరోసా**

**రామచంద్రపురం, పెన్ పవర్ జూన్ 3:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలం శేరులంక గ్రామానికి చెందిన చింతలపూడి సాయి దుర్గారావు కుటుంబానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అండగా నిలిచి తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. పేదరికాన్ని జయించి కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టాలనే లక్ష్యంతో బీటెక్ పూర్తి చేసిన సాయి దుర్గారావు, తన తండ్రి చింతలపూడి శ్రీనివాస్ దివ్యాంగుడు కావడంతో కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకున్నాడు. ఉద్యోగ అవకాశాల కోసం బెంగళూరుకు వెళ్లి ప్రయత్నాలు చేస్తూనే, డెలివరీ బాయ్‌గా పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే విధి వక్రీకరించి, విధి నిర్వహణలో ఉండగానే జరిగిన రోడ్డు ప్రమాదంలో అతను మృతి చెందడంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ విషాద ఘటన గురించి తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెంటనే స్పందించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం గ్రీవెన్స్ సెల్ ఇన్‌చార్జ్ ఆనంద్ ద్వారా కర్ణాటకలోని పార్టీ నాయకులతో సమన్వయం చేసి, సాయి దుర్గారావు పార్థివ దేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో స్వగ్రామమైన శేరులంకకు తరలించే ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా, మృతుడు పనిచేస్తున్న సంస్థతో మాట్లాడి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.50 వేల రూపాయలు కుటుంబానికి అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రమాదానికి కారణమైన కర్ణాటక ఆర్టీసీ నుంచి తగిన నష్టపరిహారం అందించడంతో పాటు, సంబంధిత సంస్థ నుంచి కూడా కుటుంబానికి పరిహారం లభించేలా చర్యలు ప్రారంభించారు. మృతుడి కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మంత్రి సుభాష్ తన వ్యక్తిగతంగా మరో రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే మృతుడి అంత్యక్రియలకు ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంతరాయ్ నేతృత్వంలోని బృందాన్ని పంపించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మృతుడు సాయి దుర్గారావు తండ్రి దివ్యాంగుడు కావడం,కుటుంబం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉండటాన్ని గుర్తించిన మంత్రి సుభాష్, అతని సోదరి చింతలపూడి మహాలక్ష్మి విద్యాభ్యాస బాధ్యతను కూడా స్వీకరించారు. ఇంటర్ పూర్తి చేసిన ఆమెకు ఉద్యోగం వచ్చే వరకు ఉన్నత విద్యను కొనసాగించేందుకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఎదిగి కుటుంబానికి అండగా నిలవాల్సిన యువకుడిని కోల్పోయిన కుటుంబానికి అన్ని విధాలుగా తోడుగా నిలిచిన మంత్రి వాసంశెట్టి సుభాష్ చర్యలను స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రశంసిస్తున్నారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం, బాధలో ఉన్న కుటుంబాలకు భరోసా కల్పించడం వంటి విలువలకు ఆయన చేసిన సేవలు నిదర్శనంగా నిలిచాయని వారు పేర్కొన్నారు.

## ఏటువంటి అసరా లేని అంధురాలుకి అరుదైన శస్త్రచికిత్స...

**శంఖవరం /తుని పెన్ పవర్ జూన్ 03:-** కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం లో తుని మమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో
నర్సీపట్నం దనివిరెడ్డి వారి వీధిలో నివాసం ఉంటున్న మిడత రాము అనే మహిళకు గతంలో పచ్చ కామెర్లు తో చూపు మందగించి పూర్తిగా కళ్ళు కనిపించని అంధురాలు, గత కొంత కాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ నర్సీపట్నం లైఫ్ లైన్ హాస్పిటల్ డాక్టర్ వంశీకృష్ణ స్కాన్ చేయించగా కడుపులో భారీ సైజులో కణితిని గుర్తించి తుని మమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కు పంపించగా హాస్పిటల్ చీఫ్ డాక్టర్ రుత్తల పుష్ప రమావాణి ఆమె దీన పరిస్థితి చూసి ఉచితంగా పరీక్షలు చేయించి ఎన్ టి ఆర్ వైద్య ఆరోగ్య సేవ ఆరోగ్యశ్రీ ద్వారా సుమారు ఐదు కేజీల కణితిని ఆపరేషన్ ద్వారా తీసివేసినారు, ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండి కోలుకుంటుంది అన్ని అన్నారు.

## శంఖవరం తహసిల్దార్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆకస్మిక తనిఖీలు....

కార్యాలయంలో సిబ్బంది ఎవరు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన జాయింట్ కలెక్టర్...



**శంఖవరం పెన్ పవర్ జూన్ 03:-(** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండల తహసిల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ శంఖవరం గ్రామంలో జనగణన లెక్కలు పూర్తి కాలేదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు
మండల తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది గైహాజరు రికార్డులు పరిశీలి కొన్ని అంశాలపై రికార్డులు ఎందుకు నమోదు చేయలేదంటూ మండిపడ్డ జిల్లా జాయింట్ కలెక్టర్
శంఖవరం గ్రామ సగరులు స్మశాన వాటిక స్థల కబ్జాపై నాకు సంబంధించిన ఫిర్యాదు కాదు అంటూ.
పట్టించుకోని ఎమ్మార్వో. జాయింట్ కలెక్టర్ ను కలిసిన సగర వాసులు సమస్యను పరిష్కరించాలంటూ పెద్దాపురం ఆర్డీవోకి ఆదేశాలు జారి చేశారు, వారం రోజుల్లో మీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట రెవెన్యూ శాఖ ఉద్యోగులు ఎవరు ఆఫీసులో లేకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు, తాసిల్దార్ తాతారావు ఒకరే అందుబాటులో ఉన్నారు.

# యూనిట్ సమావేశం



**గండేపల్లి, పెన్ పవర్,జూన్,3:**గండేపల్లి గ్రామంలో యూనిట్ ఇంచార్జ్ ఇప్పర్ల సురేష్ వారి ఆధ్వర్యంలో యూనిట్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామంలో గల సమస్యలపై కమిటీ చర్చించి తీర్మానించింది. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లంరెడ్డి రామకృష్ణ, వెంపాటి రాజు, ఆళ్ల సత్తిబాబు, బూత్ ఇంచార్జ్ ముంగర విష్ణు,ఇప్పర్ల బాబి, పైల వెంకన్న, ముంగర సూర్యారావు, యలమాటి కాశి,మాచిన బాబురావు, పెనుగాడి నాగరాజు, బోగివెల్లి శ్రీను, ఉండవిల్లి రాధాకృష్ణ,బుగత నూకరాజు, పేరారపు అబ్బులు, నందం సత్తిబాబు, గరిగిపాటి రమణ కొమ్ముకూరి అప్పారావు కటారి శివ తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరంలో టీడీపీ యూనిట్ సమావేశాలు.


ఎన్డీఏ రెండేళ్ల అభివృద్ధి పనులపై చర్చ.





**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 3:** మండలంలో తెలుగుదేశం పార్టీ యూనిట్ సమావేశాలు బుధవారం నిర్వహించారు. జె.అన్నవరం, మర్రివీడు యూనిట్ పరిధిలో తిరుమాలి, పేరవరం, యర్రవరం, లింగంపర్తి గ్రామాల్లో టీడీపీ యూనిట్ మీటింగ్స్ నిర్వహించారు. ప్రతి నెల మొదటి బుధవారం యూనిట్ పరిధిలోని రెండు గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి, టిడిపి మండల అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, యూనిట్ ఇంచార్జ్‌లు పెంటకోట శ్రీధర్, చందవోలు రాజా, బస్సా ప్రసాద్, మైరాల కనకారావు, కర్రి సుబ్బారావు, సూతి బాబులు, కరణం నాగేశ్వరరావు, తోట వెంకటేశ్వరరావు, పలివెల శ్రీనివాస్, సీనియర్ నాయకుడు అలర్క్ రాజు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జలధార--జలహారతి పనులను నాణ్యతతో జూన్ 30లోగా పూర్తి చేయాలి




**: కలెక్టర్ హరేంధిర ప్రసాద్**



**కాకినాడ, పెన్ పవర్,జూన్ 3:** జలధార--జలహారతి కార్యక్రమం కింద జిల్లాలో చేపట్టిన పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జలధార--జలహారతి కార్యక్రమం పురోగతిపై డ్వామా, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని మండలాల ఎంపీడీవోలు, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. మండలాల వారీగా జలధార--జలహారతి కింద ప్రతిపాదించిన ఉపాధి హామీ, ఇరిగేషన్ పనులు, గ్రౌండింగ్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జలధార--జలహారతి కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పనుల అమలులో ఎలాంటి రాజీ లేకుండా నాణ్యతతో చేపట్టాలని సూచించారు. జిల్లాలో చేపట్టిన అన్ని పనులను తప్పనిసరిగా జూన్ 30 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 2,061 పనులను గుర్తించగా, వాటిలో 1,837 పనులకు మంజూరు లభించిందని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద రూ.105.60 కోట్ల అంచనా వ్యయంతో 1,859 పనులు చేపట్టగా, ఇప్పటివరకు 1,263 పనులు గ్రౌండింగ్ పూర్తయ్యాయని వెల్లడించారు. అలాగే ఇరిగేషన్ శాఖ పరిధిలో 63 పనులను గుర్తించామని, వాటికి త్వరలో పరిపాలన అనుమతులు మంజూరు కానున్నాయని తెలిపారు. చెరువుల మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని, చెరువులకు అనుసంధానంగా ఉన్న కాలువల పూడికతీత, ఫీడర్ కాలువల మరమ్మత్తులను చేపట్టాలని అధికారులకు సూచించారు. అవసరమైన చోట యంత్రాల ద్వారా పనులు నిర్వహించి వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో జలధార--జలహారతి కింద చేపట్టిన ప్రతి పనిని గ్రౌండింగ్ పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద పనిదినాల కల్పనలో వెనుకబడిన మండలాలు ప్రత్యేక దృష్టి సారించి పనిదినాల సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. మధుసూదన్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శంఖవరం, కోటనందూరు తహశీల్దార్ కార్యాలయాల్లో జేసీ అపూర్వ భరత్ ఆకస్మిక తనిఖీ





**శంఖవరం/కోటనందూరు, పెన్ పవర్ జూన్ 3:** ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో, పారదర్శకంగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ సూచించారు. బుధవారం ఆయన శంఖవరం, కోటనందూరు మండలాల తహశీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యాలయాల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించిన జాయింట్ కలెక్టర్, రికార్డు గదులు, సిబ్బంది హాజరు పట్టికలు, కార్యాలయ నిర్వహణ విధానాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన వినతుల పరిష్కార పురోగతిని సమీక్షించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల నుంచి అందుతున్న అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా పీజీఆర్ఎస్, రీసర్వే అంశాలకు సంబంధించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, ఎప్పటికప్పుడు పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అనంతరం కార్యాలయ ప్రాంగణాలను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యాలయ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచి, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో శంఖవరం తహశీల్దార్ తాతారావు, కోటనందూరు తహశీల్దార్ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కర్నాకుల వీరాంజనేయులుపై పోలీసుల వేధింపులను ఖండిస్తూ ధర్నా

**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 3:** ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పై పోలీసుల వేధింపులను ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, ఏఐఎఫ్టియు పిడిఎస్యు( వి), ప్రగతిశీల మహిళా సంఘం స్త్రీ విముక్తి ) ప్రజా సంఘాల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో రంగవల్లి నగర్ లో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఏపీ ఆర్ సి ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్టీయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచె అంజిబాబు, పిడిఎస్యు (వి ) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, పి ఓ డబ్ల్యు( స్త్రీ విముక్తి) జిల్లా నాయకులు రెడ్డి దుర్గాదేవి నాయకత్వం వహించి మాట్లాడారు. కర్నాకుల వీరాంజనేయులు ను తరచూ హౌస్ అరెస్టులు చేయడం, ఆయన లేని సమయంలో ఎటువంటి నోటీసు, సెర్చి వారెంట్ లేకుండా జగ్గంపేట సర్కిల్ పరిధిలోని పోలీసులు ఆయన ఇంటిలోనికి చొరబడి ఇల్లును సాదా చేయడం మహిళలను ఇబ్బంది పెట్టడం వంటి వేధింపులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కాలుష్య కారక జిందాల్ పరిశ్రమ కు వ్యతిరేక పోరాటం,అడ్డ కొండ భూములను పేదలకు ఇవ్వాలనే పోరాటం, తదితర భూమి పోరాటాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న పోరాటాలలో క్రియాశీలకంగా పోరాడుతున్న రైతు కూలీ సంఘం పై ప్రభుత్వం అణిచివేసే కుట్రలో భాగంగానే నాయకులను నిర్బంధిస్తున్నారని విమర్శించారు. సోమవారం జిల్లాకు సీ.ఎం వస్తున్నారని నెపంతో ఎటువంటి నోటీసు ఇవ్వకుండా చర్చ్ వారెంట్ లేకుండా జగ్గంపేట సర్కిల్ పరిధిలో ఉన్న పోలీసులు చట్టవిరుద్ధంగా వీరాంజనేయులు ఇంటిలో చొరబడి సోదాలను నిర్వహించడాన్ని




తీవ్రంగా ఖండించారు. తక్షణమే అణిచివేత, పోలీస్ నిర్బంధాలను ఆపాలని డిమాండ్ చేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com


# పదవీ విరమణ పొందిన, మృతి చెందిన హోంగార్డుల కుటుంబాలకు 'చేయూత'





✷ జిల్లా ఎస్పీ బిందు మాధవ్

**కాకినాడ, పెన్ పవర్,జూన్ 3:** పోలీసు శాఖలో సేవలందించి పదవీ విరమణ పొందిన లేదా విధి నిర్వహణ సమయంలో, అనారోగ్య కారణాలతో మృతి చెందిన హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో కాకినాడ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'చేయూత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో చెక్కులను అందజేశారు.హోంగార్డులు స్వచ్ఛందంగా తమ ఒక్క రోజు డ్యూటీ అలవెన్సును విరాళంగా అందించడంతో సమకూరిన నిధులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన హోంగార్డు హెచ్‌జీ-257 చి. సుకుమార్ రాజు కుటుంబానికి రూ.4,58,660, హెచ్‌జీ-77 ఎస్. సోమేశ్వరరావు కుటుంబానికి రూ.4,57,240 ఆర్థిక సహాయాన్ని అందించారు.అలాగే మరణించిన హోంగార్డు హెచ్‌జీ-683 చి. దుర్గాప్రసాద్ భార్యకు కారుణ్య నియామకం (కంపాషనేట్ అపాయింట్‌మెంట్) కింద హోంగార్డు ఉద్యోగాన్ని కల్పించడంతో పాటు రూ.1,93,120 ఆర్థిక సహాయాన్ని అందించారు. పదవీ విరమణ అనంతరం మరణించిన హోంగార్డు హెచ్‌జీ-472 కె. గంగిశెట్టి కుటుంబానికి కూడా రూ.1,93,120 చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ, హోంగార్డుల కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో కాకినాడ పోలీసు యూనిట్‌లో పనిచేస్తున్న హోంగార్డులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఒక్క రోజు డ్యూటీ అలవెన్సును విరాళంగా అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పోలీసు కుటుంబంలో ఐకమత్యాన్ని పెంపొందించడమే కాకుండా, కష్టకాలంలో ఉన్న కుటుంబాలకు భరోసా కల్పిస్తాయని తెలిపారు.పోలీసు శాఖలో సేవలందించిన సిబ్బంది కుటుంబాలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్న ఎస్పీ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ ఆర్‌ఐ ఎం. నరసింహమూర్తి, హోంగార్డులు మరియు పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.




# జై భీమ్ ప్రీమియర్ లీగ్ ముగింపు




విజేతలకు ట్రోఫీ ప్రధానం

ఎస్సై ఆధ్వర్యంలో క్రీడా స్ఫూర్తి పెంపు

**కాట్రేనికోన పెన్ పవర్ జూన్ 3**:కాట్రేనికోన జడ్పీ స్కూల్ ఆవరణంలో జరిగిన, జై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన "జై భీమ్ ప్రీమియర్ లీగ్ – 2026" క్రికెట్ టోర్నీ ఘనంగా ముగిసింది. ఫైనల్ మ్యాచ్

అనంతరం విజేత జట్టుకు "విన్నర్ ట్రోఫీ"ని ఎస్సై అవినాష్ ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, స్నేహ భావాన్ని పెంచుతాయి. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, క్రీడలపై దృష్టి పెట్టాలని యువతకు సూచించారు. వారం రోజుల పాటు జరిగిన ఈ టోర్నీలో 8 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో ఉత్కంఠభరితమైన పోరు జరిగింది. విజేత, రన్నర్ జట్లకు ట్రోఫీలు, క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ రావు, నల్లా నరసింహమూర్తి నల్లా హరి కిషోర్ , తదితరులు పాల్గొన్నారు.

# ఆడారి సురేంద్రకు పాఠంశెట్టి సూర్యచంద్ర పరామర్శ.



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 2**: సీనియర్ జర్నలిస్ట్,ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ సభ్యుడు ఆడారి సురేంద్రకు ప్రముఖ సామాజికవేత్త, జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర బుధవారం పరామర్శించారు. ఆడారి సురేంద్ర ఇటీవల కాలంలో వెన్నుముక సంబంధించిన ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పాఠంశెట్టి సూర్యచంద్ర సురేంద్ర నివాసానికి వెళ్లి పరామర్శించడమే కాకుండా,ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట బోనస్ పెద్దయ్య,పాఠంశెట్టి శ్రీనివాస్,ఎరుబండి పెదకాపు, నడిపల్లి సతీష్, కోడి గంగాధర్, నల్లంశెట్టి చిట్టిబాబు,తదితరులు ఉన్నారు. సురేంద్రను పరామర్శించిన వారిలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉడతా అప్పారావు,బత్తిన సత్యన్నారాయణ,బంగారు వెంకటరమణ,బుద్ధ శివ,తదితరులు తదితరులు ఉన్నారు.

# పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ ఘన సన్మానం





**కాకినాడ, పెన్ పవర్,జూన్ 3**: పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులను కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.పదవీ విరమణ పొందిన వారిలో కాకినాడ త్రీ టౌన్ ఎస్సై కె. విజయ్ కుమార్, కాకినాడ వన్ టౌన్ ఎస్సై సి.హెచ్. కుమార్, కాకినాడ పోర్ట్ ఎస్సై ఎ. సూర్యప్రకాశ్, ట్రాఫిక్-వన్ ఎస్సై కె. అప్పారావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కె. నారాయణరావు ఉన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ బిందుమాధవ్ ఆయా అధికారులను దుశ్శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించి వారి సేవలను అభినందించారు. విధి నిర్వహణలో వారు ప్రదర్శించిన క్రమశిక్షణ, నిబద్ధత, సేవా భావం పోలీసు శాఖకు ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. తమ ఉద్యోగ జీవితంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు వారు అందించిన సేవలు ప్రశంసనీయమని అన్నారు.పదవీ విరమణ అనంతరం వారి జీవితం ఆరోగ్యంగా,ఆనందంగా, సుఖసంతోషాలతో సాగాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ సేవలకు ముగింపు మాత్రమేనని, సమాజానికి సేవ చేసే అవకాశాలు జీవితాంతం కొనసాగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు,ఎస్బీ డిఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, ఎం. నరసింహమూర్తి, కె. వెంకటరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.వి.వి. సత్యనారాయణమూర్తి, ఎస్పీ సీసీ ఎస్. రాంబాబు, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యమూర్తి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పదవీ విరమణ పొందిన అధికారుల సేవలను ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకుంటూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.ద

# ఇంటింటా జనగణన, ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి: కలెక్టర్ హరేంధిర ప్రసాద్




**కాకినాడ, పెన్ పవర్,జూన్ 3:** జిల్లాలో ఇంటింటా జనగణన, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కింద ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.బుధవారం కాకినాడ కలెక్టరేట్ నుంచి ఈఆర్‌వోలు, అన్ని మండలాల తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, ఇంటింటా జనగణన మరియు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత మే 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఇంటింటా జనగణన నమోదు ప్రక్రియను ప్రభుత్వం జూన్ 6 వరకు పొడిగించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేసి జూన్ 6లోపు వంద శాతం జనగణన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అలాగే జూన్ 5 నుంచి జిల్లాలో ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి సంబంధించి క్షేత్రస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని సూచించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్వోలు తప్పనిసరిగా ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను సేకరించి, వాటిని 2002 ఓటరు జాబితాతో క్షుణ్ణంగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు.ఈ ప్రక్రియలో భాగంగా బీఎల్వోలు తమ పోలింగ్ కేంద్రాల పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏ) సమాచారం అందించి వారి సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఇంకా 4.99 లక్షల గృహాల మ్యాపింగ్ పూర్తి చేయాల్సి ఉందని, ఈ ప్రక్రియను జూన్ 18 నాటికి పూర్తిచేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా ఆయా నియోజకవర్గాల ఈఆర్‌వోలు తమ పరిధిలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా సహకారం పొందాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా. టి. తిప్పే నాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం. జగన్నాథం, ఎన్నికల డిప్యూటీ తేజా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యత లేని పనులు

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యముగా వ్యవహరిస్తున్నారు.



**కాట్రేనికోన పెన్ పవర్ జూన్ 3** కాట్రేనికొన మండలంలోని తిమ్మాపురం సమీపంలో పంట కాలువ గట్టుకు నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనుల్లో నాణ్యత లేదని రైతులు, అంటున్నారు. ఇక్కడ గత కొన్ని వారాలుగా జరుగుతున్న పనులు దీనికి సంబంధించిన

, అధికారుల పర్యవేక్షణ కరువైందని ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేయిస్తున్నారని, పలువురు ఆరోపిస్తున్నారు మెటీరియల్ సరిగా పాటించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట బోధకు

నీరు వస్తే ఈ గోడ ఉంటుందా అని పలువురు ఆరోపిస్తున్న. . స్టీల్ సరిగా వేయడం లేదు. అధికారులు పని స్థలం వద్దకు వచ్చి తనిఖీ చేయడం లేదు" అని స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ బుధవారం ఉదయం కాంక్రీట్ పని చేపట్టారు. సంబంధిత అధికారులు ఎవరు దగ్గర లేరు. ఇలా అయితే పనుల్లో నాణ్యత ఎక్కడుంటుంది అని ప్రశ్నిస్తున్నారు. లష్కర్ ఉన్న వారికి కాంక్రీట్ పనులపై అవగాహన ఉండదు. ఇక్కడ కట్టిన గోడలో కంకర రాళ్ళు బయటకు కనిపిస్తున్నాయి. నాసిరకంగా చేస్తే భవిష్యత్తులో భారీ నష్టం తప్పదని ప్రజలు హెచ్చరిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పని ప్రదేశం వద్దకు వచ్చి తనిఖీ చేసి, నాణ్యతతో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

# ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన కార్యదర్శిగా కె.జె.ఎస్.ఎల్. కుమారి బాధ్యతల స్వీకారం



**కాకినాడ, పెన్ పవర్ జూన్ 3:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన కార్యదర్శిగా కె.జె.ఎస్.ఎల్. కుమారి బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గ్రేడ్-1 గ్రంథాలయాధికారిణిగా విధులు నిర్వహించిన ఆమె పదోన్నతి పొంది ఈ పదవికి నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజు వర్మతో కలిసి బుధవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ను మర్యాదపూర్వకంగా కలిశారు.జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యకలాపాల అభివృద్ధి, పాఠకులకు మెరుగైన సేవల అందజేత, గ్రంథాలయాల ఆధునీకరణ, డిజిటల్ సేవల విస్తరణ వంటి అంశాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిసింది.

నూతన బాధ్యతలు చేపట్టిన కె.జె.ఎస్.ఎల్. కుమారికి గ్రంథాలయ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది, పాఠకులు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ఆమె సేవలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# లంపకలోవ గ్రామంలో ఉపాధి శ్రామికుడు చక్రధరరావు మృతి



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూన్ 3:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) పనులు జరుగుతున్న సమయంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ లింగంపల్లి చక్రధరరావు (55) విధుల్లో పాల్గొంటున్న సమయంలో ఒక్కసారిగా అపస్మారక స్థితిలో కుప్పకూలిపోయారు.సహచర కార్మికులు వెంటనే స్పందించి ఆయనకు ప్రాథమిక చికిత్స అందించేందుకు ప్రయత్నించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం సమీప ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చక్రధరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఈ ఘటనతో సహచర కూలీలు, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.గత కొన్ని రోజులుగా జిల్లాలో కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలు,తీవ్ర ఎండల ప్రభావంతో వడదెబ్బ కారణంగానే మృతి చెందినట్లు ప్రాథమికంగా అధికారులు భావిస్తున్నారు.అయితే మరణానికి గల ఖచ్చితమైన కారణాలను నిర్ధారించేందుకు పూర్తి స్థాయి విచారణ చేపట్టినట్లు సమాచారం.ఘటన సమాచారం అందుకున్న ఉపాధి హామీ పథకం అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందాల్సిన సహాయ సహకారాలపై ఆరా తీసినట్లు తెలిసింది.ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు విజయవంతం చేయాలి

- ప్రజాకంటక పాలన చేస్తున్న కూటమి సర్కార్ ను నిలదీద్దాం
- వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ తమ్మన పిలుపు



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 03;**రాష్ట్ర వైఎస్సార్సీపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నేడు ఆలమూరులో నిర్వహించనున్న వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కార్ వైఫల్యాలను ప్రజాకోర్టులో నిలదీద్దామన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసే వరకూ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేద్దామన్నారు. అందులో భాగంగానే స్థానిక బస్టాండ్ సెంటర్ లోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపడుతున్నామన్నారు. ప్రజల దృష్టికి వాస్తవాలను తీసుకు వెళ్లేందుకు ఈ వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, మేధావి వర్గాలు, ప్రజా సంఘాలు తరలి రావాలని తమ్మన కోరారు.వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో అలమూరులోని బస్టాండ్ సెంటర్ లో గురువారం జరుగుతున్న వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

# ఆలమూరు నీటి సంఘం పరిధిలో వరాల కాలువ ఆయకట్టుకి నీరు విడుదల

ఆలమూరు నీటి సంఘం అధ్యక్షులు వైట్ల గంగరాజు(బాబి)



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 03;**మండల పరిధిలోని వరాల కాలువ ఆయకట్టు కి మంగళవారం ఆలమూరు నీటి సంఘం అధ్యక్షులు వైట్ల గంగరాజు ఆధ్వర్యంలో నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో నీరు అందించే విధంగా కృషి చేస్తూన్నామని, మెట్ట పొలాలకు కూడా నీరు అందే విధంగా కాలువల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా చేస్తూ రైతులకు ఇబ్బంది కలగకుండా నీరు అందిస్తామని తెలియజేశారు. రైతులు సకాలంలో పంటలు పండించాలంటే నీరు చాలా అవసరమని, నీటి ఎద్దడి లేకుండా రైతులకు నీరు అందిస్తామని ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ సారధ్యంలో జిల్లాలోని రైతులకు విత్తనాలు, సాగునీరు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొని నీటిని విడుదల చేశారు.0

# కొత్తపేటలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం







## ఏఐ ఆధారిత స్క్రీనింగ్‌తో చిన్నారుల ఆరోగ్య సమస్యల ముందస్తు గుర్తింపు

**కొత్తపేట,పెన్ పవర్,జూన్ 3:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండల పరిషత్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సున్నా నుంచి ఆరు సంవత్సరాల వయస్సు(0-6) గల చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన ఏఐ ఆధారిత ఈసీడీ (ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్మెంట్) స్క్రీనింగ్‌పై బుధవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట--రామచంద్రపురం డివిజన్ పరిధిలోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, వైద్యాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.టీడబ్ల్యూ, సీడబ్ల్యూ అండ్ ఈడీ ప్రాంతీయ అధికారి కె. నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎలూరు ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు కె. సుజాత రాణి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నవచేతన కార్యక్రమంలో భాగంగా ఏఐ ఆధారిత స్క్రీనింగ్ ద్వారా ఆటిజం, ఏడీహెచ్‌డీ వంటి మానసిక, అభివృద్ధి సంబంధిత రుగ్మతలను చిన్నారుల్లో ముందస్తుగా గుర్తించే అవకాశం ఉందన్నారు.

ఏఐ ఆధారిత మొబైల్ యాప్ వినియోగం ద్వారా పిల్లలలోని అభివృద్ధి లోపాలను గుర్తించి, వారికి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పిల్లల ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా మెరుగైన చికిత్స అందించే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ శిక్షణ విస్తరణ అధికారులు, వైద్యాధికారులకు సీడీపీఓ విజయశ్రీ, పి. గన్నవరం,సీడీపీఓ వై.కే.డి. రమాదేవి అమలాపురం,. సీడీపీఓ సి.హెచ్. ఇందిర రాజోలు వారు శిక్షణ అందించారు. ఏఐ స్క్రీనింగ్ యాప్ వినియోగం, రిఫరల్ నిర్వహణ, చిన్నారుల అభివృద్ధి పర్యవేక్షణ, ఆరోగ్య లోపాల గుర్తింపు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.అంగన్‌వాడీ కార్యకర్తలు గృహ సందర్శనల ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, పిల్లల ఆరోగ్య సమస్యలను తక్షణమే గుర్తించి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే డీఈఐసీ (డిస్టిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్) కేంద్రాల ద్వారా అందుబాటులో ఉన్న సేవలు, కార్యక్రమాలపై పర్యవేక్షకులు అవగాహన కల్పించారు.

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, మానసిక వికాసం, అభివృద్ధి లోపాల ముందస్తు గుర్తింపులో ఈ శిక్షణ కార్యక్రమం కీలకంగా ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.

# సేవలకు నోచుకోక.. గ్రామానికి దూరంగా ప్రభుత్వ భవనాలు



**సీతానగరం, పెన్ పవర్, జూన్ 03:**ప్రజలకు క్షేత్రస్థాయిలో సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలు వృధాగా ఉన్నాయి. లక్షలాది రూపాయల వ్యయంతో చేపట్టిన నిర్మాణాలు గ్రామానికి దూరంగా ఉండి ప్రజాధనం వృధా అయ్యిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో హెల్త్ క్లినిక్లు రైతు భరోసా కేంద్రాల పేరుతో గ్రామాలకు దూరంగా భవనాలను నిర్మించారు. అయితే మండలంలోని 19 రైతు సేవా కేంద్రాలు ఉండగా నేటికీ వీటిని కొన్ని వినియోగించక పోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. రఘుదేవపురం, ఉండేశ్వరపురం, చీపురుపల్లి నాగంపల్లి, సింగవరం, పురుషోత్తపట్నం, తదితర గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ లు రైతు సేవా కేంద్రాలు గ్రామానికి దూరంగా ఉండడంతో ఆయా శాఖల సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఇష్టపడక గ్రామాల్లోని పాత ప్రభుత్వ భవనాలు ప్రైవేటు భవనాల్లో గ్రామ సచివాలయాల్లో సేవలు అందిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు రైతులు కోరుతున్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారం వేగంగా జరగాలి :ఎమ్మెల్యే బొలిశెట్టి




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 03:**ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పి.జి.ఆర్.ఎస్)లో వచ్చే సమస్య లను వేగంగా పరిష్కారించాలని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం, పెంటపాడు మండల ప్రజా పరిషత్తు సర్వ సభ్య సమావేశం బుధవారం జరిగింది. మండల పరిషత్తు అధ్యక్షురాలు కట్టుబోయిన వేంకట లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్లు, పట్టాదారు పాస్ బుక్కులు, వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని అన్నారు. కొత్త పింఛన్లు, ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే కార్యక్రమం త్వరలోనే ప్రారంభమవుతుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చే విధంగా కూటమి ప్రభుత్వం సమర్ధవంతంగా పనిచేస్తుందని అన్నారు.ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఆశయాలను నెరవేర్చే విధంగా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలని అన్నారు. కుటుంబ సర్వేలో జనాభా తగ్గడానికి గల కారణాలను లోతుగా అధ్యయనం చేయాలని కోరారు. త్వరలో జరగనున్న ఓటర్ల జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు శ్రద్ధగా నిర్వహించాలన్నారు. అనర్హుల ఓట్లు తొలగించటం, అర్హులఓట్లు కాపాడటం ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశ్యమని అన్నారు. ఈ బృహత్తర కార్యక్రమం సమగ్రంగా జరగటానికి ఖచ్చితమైన సమాచారాన్ని అందించి ప్రజలు సహకరించాలని కోరారు.ఈ సమావేశం లో తహసీల్దార్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వేటమామిడిలో వాహన తనిఖీలు..



**అడ్డతీగల ,పెన్ పవర్, జూన్03:**అడ్డతీగల మండలం వేటమామిడి జంక్షన్లో బుధవారం సాయంత్రం పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. అడ్డతీగల సిఐ ఎం.గజేంద్ర కుమార్, ఎస్సై బి. వినోద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో ప్రధానంగా వాహన పత్రాలు, హెల్మెట్ మరియు నిబంధనల ఉల్లంఘనలపై దృష్టి సారించారు. ఈ తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని 9 వాహనాలపై కేసులు నమోదు చేసి, మొత్తం 10,000 రూపాయల అపరాధ రుసుము విధించినట్లు ఎస్సై వినోద్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# జర్నలిస్టులు హెల్త్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

**ఇంచార్జ్ డీపీఆర్వో లక్ష్మణాచార్యులు**

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 3:**వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను 2026--27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిన నేపథ్యంలో అర్హులైన జర్నలిస్టులు హెల్త్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఇంచార్జ్ డీపీఆర్వో లక్ష్మణాచార్యులు తెలిపారు.వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జారీ చేసిన జీవో ఎంఎస్ నెం.43 (తేదీ: 10-04-2026) ప్రకారం డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ పథకం అమలవుతుందని పేర్కొన్నారు. ఈ పథకంలో జర్నలిస్టు వాటాగా రూ.1,250ను సీఎఫ్ఎంఎస్ పోర్టల్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మొత్తం ప్రీమియం రూ.2,500 కాగా, మిగిలిన రూ.1,250ను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని వివరించారు.ఈ పథకం కింద జర్నలిస్టులతో పాటు వారి జీవిత భాగస్వామి, పిల్లలు, ఆధారిత తల్లిదండ్రులకు నగదు రహిత వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సంవత్సరానికి రూ.2 లక్షల వరకు వైద్య సేవలతో పాటు నిర్దేశిత చికిత్సలకు ఉచిత బాహ్య రోగుల సేవలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. పోలవరం జిల్లా పరిధిలో అక్రిడిటేషన్ కలిగిన వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

**పత్రాల సమర్పణ వివరాలు.**

హెల్త్ కార్డుల పునరుద్ధరణ కోసం ప్రీమియం చెల్లించిన అసలు చలానా, నూతన అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ ప్రతితో పాటు పాత హెల్త్ కార్డులను సమర్పించాల్సి ఉంటుంది.కొత్త హెల్త్ కార్డుల కోసం ప్రీమియం చెల్లించిన అసలు చలానా, నూతన అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ ప్రతి, జర్నలిస్టు మరియు కుటుంబ సభ్యుల హెల్త్ కార్డులు, జర్నలిస్టు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, అవసరమైన ఇతర ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. రైస్ కార్డు, ఈపీఎఫ్‌వో కార్డు జిరాక్స్ ప్రతులు కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి మాత్రమే అవసరమని తెలిపారు.అన్ని పత్రాలను జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ పోలవరం కార్యాలయంలో కార్యాలయ పనిదినాల్లో సమర్పించాలని ఇంచార్జ్ డీపీఆర్వో లక్ష్మణాచార్యులు కోరారు.

# డ్రైనేజీ లో చెత్త తొలగించండి



**జీలుగుమిల్లి ,పెన్ పవర్ ,జూన్ 3 ;** డ్రైనేజీలో చెత్త పేరుకుపోయి మురుగునీరు నిల్వ ఉండి ఇంటిలోకి వస్తుందని సిరి రామకృష్ణ ఇబ్బందులకు గురవుతున్నాడు. ఇంటిలోనే పొగాకుబేళ్లు, వస్తువులు తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలోని ఈ దుస్థితి నెలకొని ఉంది. బాధితుడు పంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. డ్రైనేజీ లోని చెత్తను తొలగించి మురుగునీరు నిల్వ ఉండకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.